డిజిటల్ చెల్లింపుల్లో మోసాలపై సమీక్ష

న్యూఢిల్లీ, నవంబర్ 24: డిజిటల్ చెల్లింపుల్లో జరుగుతున్న మోసాలపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మోసాలను అరికట్టడానికి బ్యాంకుల ఉన్నతాధికారులు, రిజర్వుబ్యాంక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించింది. ఆర్థిక సేవల కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిజిటల్ చెల్లింపుల్లో మోసాలు, సైబర్ సెక్యూరిటీ సమస్యలపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తున్నది. ఈ సమావేశానికి ఆర్థిక వ్యవహారాలు, రెవెన్యూ, టెలికం, ఎలక్ట్రానిక్స్-ఐటీ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

పెరిగిన విదేశీ నిల్వలు

ముంబై, నవంబర్ 24: క్రమంగా తగ్గుతూ వచ్చిన విదేశీ మారకం నిల్వలు మళ్లీ పెరిగాయి. ఈ నెల 17తో ముగిసిన వారాంతం నాటికి ఫారెక్స్ రిజర్వులు 5.077 బిలియన్ డాలర్లు పెరిగి 595.397 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలో రిజర్వులు 462 మిలియన్ డాలర్లు తగ్గిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న

ఆస్తుల విలువ పెరగడం ఇందుకు కారణమని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. గత వారంలో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 4.387 బిలియన్ డాలర్లు ఎగబాకి 526.391 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇదేకాలంలో పసిడి రిజర్వులు 527 మిలియన్ డాలర్లు పెరిగి 46.042 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆర్బీఐ వెల్లడించింది.

వ్యక్తిగత రుణాలపై వడ్డీపోటు!

40 బేసిస్ పాయింట్ల వరకు పెరగనున్న మిత్తి

రిజర్వ్ బ్యాంక్ కొత్త మార్గదర్శకాల సెగ



న్యూఢిల్లీ, నవంబర్ 24: బ్యాంక్ రుణాలు ప్రియం అవుతాయా?.. ముఖ్యంగా వ్యక్తిగత రుణాలు భారం కానున్నాయా?.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల తెచ్చిన కొన్ని నిబంధనలు.. వివిధ రకాల లోన్స్ రిస్క్ వెయిటేజ్‌ను అమాంతం పెంచేశాయి. దీంతో ఆయా రుణాలపై వడ్డీరేట్లు 40 బేసిస్ పాయింట్ల వరకు పెరగవచ్చని బ్యాంకింగ్ వర్గాలు సంకేతాలిస్తున్నాయి. 'ఆర్బీఐ చర్య నేపథ్యంలో బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అన్‌సెక్యూర్డ్ లోన్ల వడ్డీరేట్లను పెంచబోతున్నాయి. దీంతో రుణగ్రహీతలపై అదనపు భారం అనివార్యంగానే కనిపిస్తున్నది. ప్రధానంగా పర్సనల్ లోన్లపై కనీసం 30-40 బేసిస్ పాయింట్లు, ఇంకా చెప్పాలంటే అంతకుమించే వడ్డీరేట్లు పెరిగేందుకు వీలున్నది.' అని ఓ బ్యాంకర్ ఓ ప్రముఖ జాతీయ మీడియాతో అన్నారు. దీనిపై బ్యాంకింగ్ రంగంలో సమాలోచనలు జరుగుతున్నాయనీ స్పష్టం చేశారు.

ఇప్పటికే భారంగా..

కరోనా ప్రభావం కారణంగా కీలక వడ్డీరేట్లను తగ్గిస్తూపోయిన రిజర్వ్ బ్యాంక్.. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా గత ఏడాది నుంచి పెంచుతూ వచ్చిన విషయం తెలిసిందే. కేవలం ఏడాదిలోపే రెపో రేటును ఏకంగా 250 బేసిస్ పాయింట్లు పెంచింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిపిన ద్రవ్యసమీక్షలో చివరిసారిగా రెపోను 25 బేసిస్ పాయింట్లు పెంచగా, 6.5 శాతానికి చేరింది. ఇది ఐదేండ్లలో గరిష్ఠ స్థాయి కావడం గమనార్హం. దీంతో గృహ రుణాలతోపాటు పూచీకత్తు లేని వ్యక్తిగత రుణాలూ ప్రియమైపోయాయి. నిజానికి గృహ, వాహన, విద్యా, బంగారు రుణాలతో పోల్చితే పర్సనల్ లోన్లపై వడ్డీరేట్లు ఎక్కువే. కారణం వీటికి గ్యారంటీ ఉండదనే. అయితే ఆర్బీఐ వడ్డింపులతో వ్యక్తిగత రుణాలపై వడ్డీ భారం ఇప్పటికే పెరిగిపోగా.. ఇప్పుడు తాజా నిబంధనలతో మరింత పెరగబోతున్నది.

ప్రస్తుతం ఆయా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలను బట్టి.. అలాగే రుణగ్రహీతల క్రెడిట్ స్కోర్, లోన్ మొత్తాల ఆధారంగా పర్సనల్ లోన్లపై వడ్డీరేట్లు 10.50 నుంచి 25 శాతం మధ్య ఉన్నాయి. ఈ నేపథ్యంలో రేపోమాపో 11 నుంచి 26 శాతానికి చేరవచ్చంటున్నారు. పెరిగిన వడ్డీరేట్లు ఇప్పటికే లోన్లు తీసుకున్నవారితోపాటు కొత్తగా తీసుకోబోయేవారికీ వర్తిస్తాయని అంటున్నారు.

మరింత మూలధనం కోసం..

క్రెడిట్ కార్డులు, పర్సనల్, రిటైల్ రుణాల వంటి గ్యారంటీ లేని కన్జ్యూమర్ లోన్లు విపరీతంగా పెరుగుతూపోతున్న నేపథ్యంలో బ్యాంకింగ్ రంగ ప్రయోజనాల రక్షణార్థం.. ఈ నెల 16న బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల కన్జ్యూమర్ లోన్ల రిస్క్ వెయిటేజీని ఆర్బీఐ 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో ఇక కన్జ్యూమర్ లోన్లను ఇవ్వాలంటే మరింత మూలధనాన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు పక్కకు పెట్టుకోవాల్సి వస్తున్నది. ఆయా రుణాలపై వడ్డీరేట్లను పెంచితే తప్ప ఈ మూలధనం సమస్య రుణదాతలకు తీరేలా లేదు. అందుకే వడ్డీరేట్ల పెంపు తప్పనిసరి అని బ్యాంకర్లు అంటున్నారు. 'మూలధనాన్ని పెంచుకోవాల్సి వస్తే వడ్డీరేట్ల పెంపు తప్పనిసరే' అని ఎస్బీఐ చైర్మన్ దినేశ్ ఖారా ఇప్పటికే స్పష్టం చేశారు. మరికొన్ని బ్యాంక్ చీఫ్‌లూ ఇదే మాట చెప్తున్నారు.

ఈ బ్యాంకుల్లో ఇలా..

ప్రస్తుతం పర్సనల్ లోన్స్‌పై ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో వార్షిక వడ్డీరేట్లు.. 3 నెలల నుంచి 6 ఏండ్ల కాలపరిమితి ఆధారంగా 10.50 నుంచి 25 శాతంగా ఉన్నాయి. అలాగే ఐసీఐసీఐ బ్యాంక్‌లో 10.50 నుంచి 16 శాతంగా ఉంటే.. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో ప్రారంభ రేటు 10.55 శాతంగా ఉన్నది. ఇక బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ)లో 12.40 నుంచి 17.45 శాతంగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వ్యక్తిగత రుణాలు 15.5 శాతం పెరిగి రూ.1.78 లక్షల కోట్లకు చేరాయి. ఐసీఐసీఐ బ్యాంక్‌లోనూ 40 శాతం ఎగిసి రూ.1.04 లక్షల కోట్లను తాకాయి. అంతేగాక బ్యాంక్ క్రెడిట్ కార్డు పోర్ట్‌ఫోలియో కూడా 29.5 శాతం ఎగిసి రూ.43,230 కోట్లకు చేరింది. కొటక్ మహీంద్రా బ్యాంక్ అన్‌సెక్యూర్డ్ రుణాల వ్యాపారం సైతం 50 శాతం ఎగబాకి రూ.38,311 కోట్లను చేరింది. ఈ ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్షలో దీనిపై ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళననూ వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, లేకపోతే సంక్షోభం ముప్పు తప్పదనే నిర్ణయానికి వచ్చారు. ఫలితంగానే కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి.

అదానీ-హిండెన్‌బర్గ్ వివాదం

సెబీకి సుప్రీం క్లీన్‌చిట్!

న్యూఢిల్లీ, నవంబర్ 24: సెబీని తప్పుబట్టేందుకు తమకు ఏ కారణం కనిపించడం లేదని అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై విచారిస్తున్న సుప్రీం కోర్టు శుక్రవారం తేల్చిచెప్పింది. ఈ వ్యవహారంలో మార్కెట్ రెగ్యులేటర్ పాత్రను అనుమానించేలా తమ ఎదుటకు ఏమీ రాలేదని స్పష్టం చేసింది. అంతేగాక ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని చెప్పబోమన్న అత్యున్నత న్యాయస్థానం.. మీడియాలో వచ్చినదాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కూడా సెబీని ఆదేశించలేమన్నది. ఈ క్రమంలోనే తీర్పును రిజర్వ్ చేసింది. అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంలో దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పరిడివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగానే సెబీకి దాదాపుగా సుప్రీం క్లీన్‌చిట్ ఇచ్చింది.

భూషణ్ వాదించినా..

మరోవైపు ఈ కేసులో సెబీ పాత్రపై అనుమానం ఉందని ఓ పిటిషనర్ తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టులో వాదించారు. ఈ క్రమంలోనే అసలు సెబీ దర్యాప్తును నమ్మడం ఎలా? అన్ని ప్రశ్నించారు. దీంతో సెబీ ఏం చేసిందన్నది మా ముందున్న నివేదికలో ఉందంటూ ధర్మాసనం భూషణ్ వాదనను తోసిపుచ్చింది. ఇక గతంలో సుప్రీం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీలోని ఇద్దరి అభిప్రాయాలను భూషణ్ ఊటంకించడంపైనా ధర్మాసనం ఈ సందర్భంగా స్పందించింది. ఆరోపణలు చేయడం చాలా సులువన్న కోర్టు.. ఈ విషయంలో భూషణ్‌కూ ఒకింత చురకలు అంటించడం గమనార్హం. సెబీ తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహెతా.. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఉన్న మొత్తం 24 ఆరోపణల్లో 22 పైన దర్యాప్తు పూర్తయిందన్నారు. మిగతా రెండు కేసుల్లో విదేశీ రెగ్యులేటర్ల నుంచి సమాచారం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే దర్యాప్తు గడువును మరోసారి పొడిగించాల్సిన అవసరం లేదన్నారు. దీంతో ఈ అంశంపై తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది. కాగా, ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టు నియమించిన నిపుణుల కమిటీ.. అదానీ గ్రూప్‌నకు అందులో క్లీన్‌చిట్ ఇచ్చిన సంగతి విదితమే. ప్రాథమికంగా ఎటువంటి తప్పులు జరుగలేదన్నదీ తెలిసిందే. ఈ విషయంలో సెబీ వైపు నుంచి కూడా ఎటువంటి లోపాలు లేవన్నది.

ఇదీ సంగతీ..

అదానీ గ్రూప్ సంస్థలు దేశీయ స్టాక్ మార్కెట్లలో అవకతవకలకు పాల్పడి షేర్ల విలువను కృత్రిమంగా పెంచుకున్నాయని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ ఈ ఏడాది ఆరంభంలో ఓ సంచలన నివేదికను విడుదల చేసిన సంగతి విదితమే. దీంతో ఆయా కంపెనీల షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. అదానీ గ్రూప్ మార్కెట్ విలువ కూడా రోజుల వ్యవధిలోనే లక్షల కోట్ల రూపాయలు హరించుకుపోయింది. మదుపరుల సంపద పెద్ద ఎత్తున ఆవిరైపోవడంతో ఈ వ్యవహారం రాజకీయంగా కూడా దుమారం రేపింది.

హైదరాబాద్‌లోని రహేజా మైండ్ స్పేస్‌లో మిషన్ ఈ-వేస్ట్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్. చిత్రంలో సెలెక్ట్ మొబైల్స్ సీఎండీ వై గురు, కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీ రేతినేని తదితరులు

మైండ్ స్పేస్‌లో సెలెక్ట్ మిషన్ ఈ-వేస్ట్

హైదరాబాద్, నవంబర్ 24: ఎలక్ట్రానిక్స్ వేస్ట్ నిర్వహణ, రీసైక్లింగ్ మిషన్ ఈ-వేస్ట్ పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మల్టీబ్రాండ్ మొబైల్ రిటైల్ దిగ్గజం సెలెక్ట్ మొబైల్స్. హైదరాబాద్‌లోని మైండ్ స్పేస్‌లో ఏర్పాటు చేసిన మిషన్ ఈ-వేస్ట్‌ను రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎప్పటికప్పుడు పెరుగుతున్న ఎలక్ట్రానిక్స్ వినియోగంలో పర్యావరణ, ఆరోగ్యంపై ఈ-వేస్ట్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని, ఇందుకు పరిష్కారంగా మిషన్ ఈ-వేస్ట్‌కు సెలెక్ట్ మొబైల్స్ శ్రీకారం చుట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. జీవన ప్రమాణాలు పెంచే లక్ష్యంతో సేకరించిన ఈ-వేస్ట్‌ను నిబంధనలకు అనుగుణంగా రీసైక్లింగ్ చేపట్టాలని ఆయన సూచించారు. ఈ-వేస్ట్ నిర్వహణ కేవలం పర్యావరణ హితం కోసమే కాదని, ప్రతి భారతీయ పౌరునికి అత్యవసరమన్నారు. హైదరాబాద్‌లో 300కి పైగా క్యాంపస్‌లు ఉన్నాయని, వీటిలో కూడా మిషన్ ఈ-వేస్ట్‌ను ఏర్పాటు చేయాలని సెలెక్ట్ ప్రతినిధులకు జయేశ్ రంజన్ సూచించారు. కారిడార్‌లో ఏర్పాటు చేసిన ఈ వేస్ట్ బిన్‌తో క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తున్నది. ఈ ఓటీపీని ఎంటర్ చేసిన తర్వాత ఈ వేస్ట్ వివరాలను పొందు పరుచాల్సి ఉంటుంది. ఇలా చేసిన వారికి వర్చ్యువల్‌గా రూ.10 వేల వరకు డిస్కౌంట్ కూపన్ లభించనున్నది. ఈ కూపన్‌తో సెలెక్ట్ మొబైల్ రిటైల్ అవుట్‌లెట్‌లో ఏదైనా వస్తువును కొనుగోలు చేసుకోవచ్చును.

బ్లాక్‌బస్టర్ టాటా టెక్నాలజీస్

రూ.3,000 కోట్ల ఆఫర్‌కు రూ.1,56,000 కోట్ల బిడ్స్

50 లక్షలకుపైగా దరఖాస్తులు అందుకున్న ప్రైవేటు ఇష్యూ

న్యూఢిల్లీ, నవంబర్ 24: సంస్థాగత ఇన్వెస్టర్లు, రిటైల్ మదుపరులు పెట్టుబడి చేసేందుకు పరుగులు తీయడంతో టాటా టెక్నాలజీస్ ఐపీవో మార్కెట్లో కొత్త రికార్డులు సృష్టించింది. ఆఫర్ ముగింపు రోజైన శుక్రవారం ఇది ఏకంగా 70 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయ్యింది. కేవలం రెండు రోజుల్లోనే 50 లక్షలకుపైగా ఐపీవో దరఖాస్తులు అందుకుని రికార్డు నెలకొల్పింది. ఆటోమొబైల్, ఎయిర్‌లైన్ కంపెనీలకు డిజిటల్ ఇంజినీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సర్వీసుల్ని అందించే టాటా టెక్నాలజీస్‌కు ఆఫర్ ప్రైస్ బ్యాండ్‌ను రూ.475-500గా నిర్ణయించారు. 15 ఏండ్ల క్రితం ఐపీవోకు వచ్చిన అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీ రిలయన్స్ పవర్, ఇటీవల ఆఫర్లు జారీ చేసిన నైకా, జొమాటోకు అందిన అప్లికేషన్ల కంటే టాటా టెక్నాలజీస్ అధికంగా సాధించిందని బ్రోకరేజ్ సంస్థ నువామా ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ తెలిపింది. టాటా టెక్నాలజీస్ ఐపీవోలో దాదాపు 4.50 కోట్ల షేర్లు ఆఫర్ చేస్తుండగా, చివరిరోజునాటికి ఏకంగా 312 కోట్ల షేర్లకు బిడ్స్ వచ్చాయి. రూ.3,042 కోట్ల సమీకరణ కోసం ఆఫర్ జారీచేయగా, రెండు రోజుల క్రితమే యాంకర్ ఇన్వెస్టర్లకు (వివిధ సంస్థలు) రూ.791 కోట్ల విలువైన షేర్లను కంపెనీ కేటాయించింది. ఇష్యూలో మిగిలిన రూ.2,251 కోట్ల విలువైన షేర్లకు ఇన్వెసర్లు రూ.1,56,000 కోట్ల విలువైన బిడ్స్ సమర్పించారు. ఇప్పటివరకూ ఐపీవోలో అధిక మొత్తాన్ని (రూ.7.5 లక్షల కోట్లు) ఆకర్షించిన రికార్డు రిలయన్స్ పవర్ పేరిట ఉంది. దేశంలో అతిపెద్ద ఐపీవో (రూ.21,000 కోట్లు) అయిన ఎల్ఐసీ ఆఫర్ 2.95 రెట్లు మాత్రమే ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయ్యింది.

గ్రే మార్కెట్లో భారీ ప్రీమియం

ఐపీవో శ్రేణి గరిష్ఠ ధరతో పోలిస్తే టాటా టెక్నాలజీస్ షేరు 80 శాతం అధిక ప్రీమియం గ్రే మార్కెట్లో పలుకుతున్నదన్న వార్తలు వెలువడటం పలు బ్రోకింగ్ కంపెనీలు ఈ ఇష్యూ పట్ల పాజిటివ్ ఇన్వెస్ట్‌మెంట్ రేటింగ్‌లు ఇవ్వడం, టాటా గ్రూప్ నుంచి 19 ఏండ్ల తర్వాత జారీ అవుతున్న ఇష్యూకావడం తదితర అంశాలతో ఐపీవో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. 2004లో టాటా గ్రూప్ నుంచి వచ్చిన ఐటీ దిగ్గజం టీసీఎస్ ఐపీవోలో మదుపుచేసినవారికి ఇప్పటికే ఎన్నో రెట్ల లాభాన్ని అందించిన సంగతి తెలిసిందే. ఐపీవో అప్పర్ ప్రైస్ బ్యాండ్ రూ.500 వద్ద టాటా టెక్నాలజీస్ పీఈ (ప్రైస్ టూ ఎర్నింగ్స్) 32.5 రెట్లు ఉన్నదని, ఇదే తరహా వ్యాపారంలో ఉన్న కేపీఐటీ టెక్నాలజీస్ 108.9 పీఈ, టాటా ఎలక్సి 68.5 పీఈ, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ 40 పీఈ వద్ద ట్రేడవుతున్నాయని ఎస్బీఐ సెక్యూరిటీస్ వివరించింది. సహ సంస్థలకంటే తక్కువ విలువకు లభిస్తున్నందున, ఆఫర్‌కు దరఖాస్తు చేయమంటూ సిఫార్సు చేసింది. ఇటువంటి సిఫార్సులు వెల్లువెత్తడంతో ఐపీవో ముగింపు రోజున ఇన్వెస్టర్లు క్యూ కట్టారు.

సంస్థాగత ఇన్వెసర్ల కోటా 200 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్

టాటా టెక్నాలజీస్ ఐపీవోలో షేర్లు దక్కించుకోవడానికి అత్యధికంగా సంస్థాగత ఇన్వెస్టర్లు పోటీపడ్డారు. అర్హులైన సంస్థాగత ఇన్వెస్టర్ల (క్యూఐబీలు) నుంచి ముగింపురోజున బిడ్స్ వెల్లువెత్తాయి. ఈ కోటాకు 1.05 కోట్ల షేర్లు కేటాయించగా, 203 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయ్యింది. 214 కోట్ల షేర్లకు బిడ్స్ అందాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు 78.87 కోట్ల షేర్లకు బిడ్‌చేయగా, దేశీయ సంస్థలు, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్స్ కలిసి 135 కోట్ల షేర్లకు బిడ్స్ వేశాయి. హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్ల విభాగంలో రూ.10 లక్షలకు పైబడి మదుపు చేసే వారికోసం కేటాయించిన 52.73 లక్షల షేర్లకు 37.37 (70 రెట్లు) కోట్ల షేర్లను కోరుతూ బిడ్స్ అందాయి. రూ.2-10 లక్షల మధ్య ఇన్వెస్ట్‌చేసేవారి కోటాకు 45 రెట్లు బిడ్స్ వచ్చాయి. రూ.2 లక్షల లోపు మదుపు చేసే రిటైల్ ఇన్వెస్టర్లకు 1.85 కోట్ల షేర్లను రిజర్వ్‌చేయగా, అందుకు 16.50 రెట్లు 30.46 కోట్ల షేర్లకు సబ్‌స్క్రిప్షన్స్ అందాయి. టాటా టెక్నాలజీస్ షేరు డిసెంబర్ 5న లిస్టయ్యే అవకాశం ఉంది.

పేటీఎంకు

బఫెట్ గుడ్‌బై

న్యూఢిల్లీ, నవంబర్ 24: దేశీయ పేమెంట్ అగ్రిగేటర్ పేటీఎం నుంచి ప్రపంచ ప్రసిద్ధ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ పూర్తిగా వైదొలిగారు. బఫెట్‌కు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ బెర్క్‌షైర్ హాథ్‌వేకు పేటీఎం మాతృసంస్థ ఒన్97 కమ్యూనికేషన్‌లో ఉన్న వాటాలన్నింటినీ రూ.1,370 కోట్లకు విక్రయించింది. షేరుకు రూ.877.2 చొప్పున ఈ లావాదేవీ జరిగింది. బెర్క్‌షైర్ హాథ్‌వే యూనిట్ బీహెచ్ ఇంటర్నేషనల్ యూనిట్‌కు పేటీఎంలో 2.46 శాతం (1.56 కోట్ల షేర్లు) వాటా ఉంది. ఈ వాటాను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో బల్క్ డీల్స్ ద్వారా మరో రెండు విదేశీ ఫండ్స్ కొనుగోలు చేశాయి. అయితే పేటీఎం పెట్టుబడిలో బెర్క్‌షైర్ రూ.507 కోట్ల వరకూ నష్టం చవిచూసింది.

2018లో సగటున రూ.1,279.7 ధరతో రూ.2,179 కోట్లు పేటీఎం పెట్టుబడి చేయగా, ఒన్97 ఐపీవోలో రూ.2,150 ధరతో కొంత వాటాను విక్రయించి రూ.301 కోట్లు లాభం పొందినప్పటికీ, తాజాగా తక్కువ ధరకు వాటానంతటినీ విక్రయించడంతో రూ.507 కోట్ల నష్టం తెచ్చుకుంది. ఈ కంపెనీ ఐపీవో ధరతో పోలిస్తే ప్రస్తుతం సగానికంటే తక్కువ ధరకు షేరు ట్రేడవుతున్నది. ఈ వార్తతో ఈ షేరు 3.5 శాతం నష్టపోయి రూ.892 వద్ద ముగిసింది.

13 లక్షల కోట్లకు అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణాలు

ముంబై, నవంబర్ 24: ఒకవైపు వ్యక్తిగత రుణాలపై రిజర్వు బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ ఆర్థిక సేవల సంస్థలు మాత్రం విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి దేశవ్యాప్తంగా అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణాలు నాలుగు రెట్లు పెరిగి రూ.4.26 లక్షల కోట్ల నుంచి రూ.13.3 లక్షల కోట్లకు చేరుకున్నట్టు దేశీయ రేటింగ్ ఏజెన్సీ కేర్ రేటింగ్ వెల్లడించింది. ఇదే సమయంలో మొత్తం వ్యక్తిగత రుణాలు మూడింతలు పెరిగి రూ.51.7 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత ఏడేండ్లలో బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థలు తమ వ్యక్తిగత రుణాల మంజూరు ఒకటిన్నర రెట్లు పెరిగి ఈ మార్చి నాటికి రూ.170.5 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఆదాయం, ఖర్చుల మధ్య అంతరం పెరిగిపోతుండటంతో అత్యవసర నిమిత్తం ప్రజలు వ్యక్తిగత రుణాలు తీసుకోవడానికి మొగ్గుచూపుతున్నారు.

దేశీయ మార్కెట్లోకి కమర్షియల్ వాహనాలను విడుదల చేస్తున్న వీఈసీవీ ఎండీ, సీఈవో వినోద్ అగర్వాల్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గంగదీప్‌సింగ్

టీఎస్ఐఐసీకి

ఐజీబీసీ అవార్డు

హైదరాబాద్, నవంబర్ 24: తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ)కు శుక్రవారం ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) అవార్డు లభించింది. 112.2 కోట్ల చదరపు అడుగుల్లో అభివృద్ధి చేసిన 736 గ్రీన్ బిల్డింగ్ ప్రాజెక్టులకుగాను ఈ పురస్కారం దక్కింది. చెన్నైలో ఐజీబీసీ నిర్వహిస్తున్న మూడు రోజుల గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్ జాతీయ సదస్సులో టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ ఈవీ నరసింహారెడ్డి అవార్డును తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం చొరవతో రాష్ట్రంలో గ్రీన్ బిల్డింగ్‌ల అభివృద్ధికి టీఎస్ఐఐసీ, ఐజీబీసీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే.

3 బ్యాంకులపై ఆర్బీఐ ఫైర్

ముంబై, నవంబర్ 24: మూడు బ్యాంక్‌లపై రిజర్వు బ్యాంక్ కొరడా ఝుళిపించింది. పలు నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించినట్టు తేలడంతో ప్రభుత్వరంగ బ్యాంకులైన బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌తోపాటు సిటీ బ్యాంక్‌లపై రూ.10.34 కోట్ల జరిమానా విధించింది. వీటిలో అత్యధికంగా సిటీబ్యాంక్‌పై రూ.5 కోట్లు విధించింది. డిపాజిటరీ ఎడ్యుకేషన్, ఫండ్ స్కీంలను అవగాహణ కల్పించడంలో విఫలం కావడంతో సెంట్రల్ బ్యాంక్ కన్నెర్రచేసింది. అలాగే బీవోబీపై 4.34 కోట్లు, ఐవోబీపై కోటి రూపాయలు జరిమానా విధించింది.

ఎల్ఐసీ షేర్ అదుర్స్

10 శాతం పెరుగుదల ● లిస్టింగ్ తర్వాత ఇదే అతిపెద్ద లాభం

న్యూఢిల్లీ, నవంబర్ 24: దేశీయ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) షేర్ అదరగొట్టింది. స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనైనప్పటికీ బీమా రంగ షేర్లు మాత్రం కదంతొక్కాయి. దీంట్లో బీమా దిగ్గజం ఎల్ఐసీ షేర్ 10 శాతం వరకు లాభపడింది. స్టాక్ మార్కెట్లో లిస్టైన తర్వాత ఇంతటి భారీ స్థాయిలో లాభపడటం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇంట్రాడేలో 10 శాతానికి పైగా లాభపడిన బీఎస్ఈలో కంపెనీ షేర్ మార్కెట్ ముగిసే సమయానికి 9.69 శాతం ఎగబాకి రూ.677.65 వద్ద ముగిసింది. అటు ఎన్ఎస్ఈలోనూ షేర్ 9.71 శాతం లాభపడి రూ.677.70 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.37,855.12 కోట్లు పెరిగి రూ.4,28,613.47 కోట్లకు చేరుకున్నది. బీఎస్ఈలో 16.53 లక్షల షేర్లు చేతులు మారగా..అటు ఎన్ఎస్ఈలో 1.89 కోట్ల షేర్లు చేతులు మారాయి. వచ్చే కొన్ని నెలల్లో 3 నుంచి 4 కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మోహంతీ ఇటీవల వ్యాఖ్యానించడం షేర్ ధర దూసుకుపోవడానికి దోహదం చేసింది. దేశీయ జీవిత బీమా వ్యాపారంలో ఎల్ఐసీ 58.50 శాతం వాటా కలిగివున్నది. మరోవైపు, బీమా రంగ షేర్లు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా షేర్ 18 శాతం లాభపడగా, న్యూ ఇండియా అస్యూరెన్స్ షేరు 20 శాతం ఎగబాకింది.

నష్టపోయిన సూచీలు

వరుసగా రెండోరోజు దేశీయ ఈక్విటీ మార్కెట్లు నష్టపోయాయి. ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. కానీ, బ్యాంకింగ్ రంగ సూచీలు కోలుకోవడం భారీ నష్టాలను తగ్గించుకోగలిగాయి. ఒకదశలో 200 పాయింట్ల స్థాయిలో నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 47.77 పాయింట్లు నష్టంతో 65,970.04 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 7.30 పాయింట్లు తగ్గి 19,794.70 వద్ద ముగిసింది. మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 175.31 పాయింట్లు, నిఫ్టీ 62.9 పాయింట్లు బలపడింది. వారాంతం ట్రేడింగ్‌లో హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టీసీఎస్, టెక్ మహీంద్రా, నెస్లె, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్ షేర్లు నష్టపోగా..యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, కొటక్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

క్రెడిట్ కార్డును తెగవాడేస్తున్నారు..

అక్టోబర్ నెలలో రూ.1.78 లక్షల కోట్లు



న్యూఢిల్లీ, నవంబర్ 24: దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డును తెగవాడేస్తున్నారు. పండుగ సీజన్‌కావడంతో గత నెలలో ఏకంగా 1.78 లక్షల కోట్ల రూపాయల లావాదేవీలు కేవలం క్రెడిట్ కార్డులపై జరిగాయట. సెప్టెంబర్ నెలలో నమోదైన రూ.1.42 లక్షల కోట్ల కంటే ఇది 25.35 శాతం అధికం. పాయింట్ ఆఫ్ సేల్(పీవోఎస్), ఈ-కామర్స్ ద్వారా జరిపే కొనుగోళ్లకు అత్యధికంగా క్రెడిట్ కార్డును వినియోగించినట్టు ఓ సర్వే వెల్లడించింది. వీటిలో పీవోఎస్ ద్వారా జరిగే లావాదేవీలు రూ.57,774 కోట్ల స్థాయిలో ఉండగా, అదే ఈ-కామర్స్ చెల్లింపులు రూ.1,20,794.40 కోట్లుగా ఉన్నాయని పేర్కొంది. బ్యాంకుల విషయానికి వస్తే హెచ్‌డీఎఫ్‌సీకి చెందిన క్రెడిట్ కార్డు ద్వారా అత్యధికంగా లావాదేవీలు జరిగాయి. గత నెలలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డుతో రూ.45,173 కోట్లు జరుపగా, సెప్టెంబర్‌లో ఇది రూ.38,662 కోట్లుగా ఉన్నాయి. పండుగ సీజన్‌కు తోడు కస్టమర్లు ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా ఉండటంతో క్రెడిట్ కార్డుతో అత్యధికంగా కొనుగోళ్లు జరిపారని ఇండియా రేటింగ్ అండ్ రీసర్చ్ సీనియర్ అనలిస్ట్ అంకిత్ జైన్ తెలిపారు.

భవిష్యత్తుపై నీలినీడలు

ఒకవైపు రిజర్వు బ్యాంక్ అన్‌సెక్యూరిటీ రుణాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నప్పటికీ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు విరివిగా క్రెడిట్ కార్డులను జారీ చేస్తున్నాయి. దీంతో భవిష్యత్తులో ఈ మార్కెట్‌పై నీలినీడలు కమ్ముకునే అవకాశాలున్నాయి. కమర్షియల్ బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థలు అత్యధికంగా ఈ రుణాలను మంజూరు చేస్తున్నాయి. తాజాగా ఆర్బీఐ విడుదల చేసిన మార్గదర్శకాలతో వీటి వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలున్నాయని ఆర్థిక విశ్లేషకులు వెల్లడించారు.

- గత నెలలో 16.90 లక్షల క్రెడిట్ కార్డులను జారీచేశారు. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం కార్డుల సంఖ్య 9.30 కోట్ల నుంచి 9.47 కోట్లకు చేరాయి.
- 1.91 కోట్ల క్రెడిట్ కార్డులతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఏడాది క్రితం 1.88 కోట్లు ఉన్నారు.
- అలాగే ఎస్బీఐ కార్డుకి 1.8 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ 1.6 కోట్లు, యాక్సిస్ బ్యాంక్‌కు 1.33 కోట్లు క్రెడిట్ కార్డు కస్టమర్లు కలిగివున్నారు.

బ్యాంక్ క్రెడిట్ కార్డు లావాదేవీలు (రూ.కోట్లలో)

హెచ్‌డీఎఫ్‌సీ	45,173
ఐసీఐసీఐ	34,158
యాక్సిస్	21,729
ఎస్బీఐ కార్డు	35,406

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.